# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 03 మే 2025




ప్రధానమంత్రి సభలో మంత్రి రాంప్రసాదరెడ్డి

## జేఎన్టీయూ ప్రొఫెసర్ బి.వి సౌజన్య కు డాక్టరేట్



బి.ఏ. సౌజన్య

**పులివెందుల,మే2, ప్రభాత వార్త:**
పులివెందుల పట్టణంలోని జెఎన్టీయూ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న బి.వి సౌజన్య కు డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యూనివర్సిటీ ఇండోర్ లో గురువారం డాక్టరేట్ పట్టాను ఆమె అందుకున్నారు. ఈసందర్భంగా బి.ఎ సౌజన్య మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ మరియు ఇమేజ్ ప్రాసెసింగ్ నిఉపయోగించి ఒక అల్గారిథమ్ మరియు విభిన్న సాంకేతికత యొక్క విశ్లేషణకుగాను పిహెచ్ డి పట్టా ఇవ్వడం జరిగిందని తెలిపారు.ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. విష్ణు వర్ధన్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శేషమహేశ్వరమ్మ, హెచ్ ఓ డి డాక్టర్ షేక్ తాజ్ మహబూబ్ ,చంద్ర మోహన్ రెడ్డి మరియు తోటి అధ్యాపకుల బృందం, కరెంట్ జయరామిరెడ్డి కుమార్తె సౌజన్య కి డాక్టరేట్ వచ్చినందుకు సాయి యూనివర్సల్ మైనింగ్ సీఈవో ప్రభాకర్ రెడ్డి,మిట్ట కరుణాకర్,యు సి ఐ ల్ మోహన్ రెడ్డి,జయసింహ, ప్రసాద్ రెడ్డి,నాగేంద్ర, టీచర్గంగిరెడ్డి,హరినాథ్, అభిలాష్ ఆమె తండ్రి కరెంట్ జయరామి రెడ్డిఅభిలాష్ లు ఆమెకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.



రైతుల ఆశలు

# నేలపాలు..!

- ఈదురుగాలులకు నేలరాలిన మామిడికాయలు

- మండలంలో 2900 ఎకరాలలో మామిడిసాగు

**గాలివీడు, మే 2(ప్రభాతవార్త):**
ప్రకృతి వైపరీత్యాలతో మామిడి రైతు కుదేలు అవుతున్నాడు. ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలకు మామిడి రైతుల ఆశలు నేల రాలుతున్నాయి. ప్రస్తుత సీజన్లో పలు పర్యాయాలు ఈదురుగాలు,వర్షాల వల్ల చేతికందుతున్న మామిడి కాయలు నేలరాలి రైతులు లబోదిబోమంటున్నారు. పూతదశలో మామిడి పంటకు వ్యాపించిన చీడపీడల వల్ల అసలే దిగుబడి తగ్గి దిగాలుతో ఉన్న రైతులను అకాల వర్షాలు ఉన్నది కాస్తా ఊడ్చేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గాలివీడు మండలంలో మొత్తం 2900 ఎకరాలలో మామిడి పంట సాగు చేయగా, ఇటీవల కురిసిన వర్షం, ఈదురు గాలులకు 150 ఎకరాలలో మామిడి పంట దెబ్బతిని రైతులు నష్టపోయారని ఉద్యానవన అధికారిణి నాగమణి తెలిపారు. గాలివీడు గ్రామ పరిధి బుట్టిగారిపల్లెలో రైతు శ్రీకాంత్‌రెడ్డి 10 ఎకరాలలో మామిడి సాగు చేయగా ఏప్రిల్ 18వ తేదీ ఈదురుగాలులతో కూడిన వర్షంతో అపార నష్టాన్ని చవిచూడగా, మే 1వ తేదీ మరోమారు ఈదురుగాలుల వర్షం బీభత్సం సృష్టించడంతో పంట పూర్తిగా నేలపాలైందని వాపోయారు. పది రోజుల వ్యవధిలోనే రెండు పర్యాయాలు ఈదురుగాలులు, అకాల వర్షాలు కురవడంతో ప్రకృతి ప్రకోపానికి మామిడి రైతులు విలవిలలాడిపోతున్నారు. వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బంగారు చోరీ ముఠా అరెస్ట్

రూ. 75 లక్షల విలువైన బంగారం స్వాధీనం

విలాసాలకు బానిసలై చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడి

జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి



**మదనపల్లెక్రైమ్, మే 2 ప్రభాతవార్త.**
రెండు వేర్వేరు బంగారు చోరీ కేసుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు 835 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ ( పరిపాలన) ఎం వెంకటాద్రి తెలిపారు. పట్టుబడిన సొత్తు విలువ సుమారు రూ. 75 లక్షలు ఉంటుందన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో నిందితులు పాలగిరి అమీర్ సుహేల్ (26), పాలగిరి సమీర్ అహమ్మద్ (22), కన్నెమడుగు కిషోర్ (29), మొగసాల తిరుమలేష్ (27), టేకులపాలెం అరుణ్ కుమార్ (27)ల అరెస్ట్ చూపించారు. అడిషనల్ ఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురబల కోట మండలంకు చెందిన పాలగిరి మస్తాన్ ఇంట్లో గత నెల 25వ తేదీ 835 గ్రాములు బంగారు చోరీకి గురి అయింది. 27వ తేదీ వరలక్ష్మి ఇంట్లో 93 గ్రాముల బంగారం చోరీకి గురి అయింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మదనపల్లి రూరల్ సత్యనారాయణ, ముదివేడు ఎస్సై దిలీప్ కుమారులు దర్యాప్తు కొనసాగిస్తుండగా కురబలకోట మండలం సీటీయంఅంగళ్లు రోడ్డులోని కనసానివారిపల్లె బస్సు స్టాప్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న పాలగిరి మస్తాన్ కుమారుడు అమీర్ సుహేల్, రెండో కుమారుడు సమీర్ అహ్మద్, అతని స్నేహితులు కన్నెమడుగు కిషోర్, తిరుమలేష్, అరుణ్ కుమార్ లు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వీరిలో కిషోర్‌పై గతంలో కూడా బంగారు చోరీ కేసు, అరుణ్ కుమార్ పై గతంలో మద్యం కేసులు, హత్య కేసు కూడా ఉండడంతో వారి నుంచి విచారణ ప్రారంభించారు. రెండు ఇళ్లల్లో తామేచోరీ చేసినట్లు అంగీకరించారు. అనంతరం వారి వద్ద నుంచి 75 లక్షల విలువ చేసే 835 గ్రాముల బంగారం రికవరీ చేసినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. చిన్నతనం నుంచి విలాసాలకు అలవాటు పడటం, క్రికెట్ బెట్టింగులకు బానిసలై డబ్బు సంపాదించడానికి నేరాల బారిన పడ్డారన్నారు. మొదటి కేసులో నిందితుల నుంచి 743 గ్రాముల బంగారం (సుమారు రూ. 67.5 లక్షలు), రెండు హాక్సా బ్లేడ్లు, కిటికీ ఇనుప గ్రిల్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ బంగారు రసీదు కాపీని స్వాధీనం చేసుకోగా, రెండవ కేసులో నిందితుడు కిషోర్ వద్ద నుంచి 92 గ్రాముల బంగారం (సుమారు రూ. 7.5 లక్షలు) రికవరీ చేశామని తెలిపారు. నిందితులు చిన్న వయస్సులోనే విలాసాలకు, క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసలై డబ్బు సంపాదించడానికి నేరాల బాట పట్టారని విచారం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. క్రికెట్ బెట్టింగ్ మరియు ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దొంగతనాలను అరికట్టడానికి పోలీస్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై దిలీప్ కుమార్, సిబ్బందిని అదనపు ఎస్పీ, డి.ఎస్.పి మహేంద్రలు అభినందించారు.

## హెచ్. చెల్లోపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్

**రాజంపేట అర్బన్, మే2 ప్రభాతవార్త**



అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ భూపతి రాజు పండేటి సహకారముతో రాజంపేట మండలం హస్తవరం చెర్లోపల్లి గ్రామములో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ వెంకట లక్ష్మి నరసింహ రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం లో ప్రజలకు నీటి సమస్యలతో బాధపడుతుంటారని,మోకాళ్ళ నొప్పులు, ఇతరతర జబ్బులు రాకుండా ఉండాలంటే స్వచ్ఛమైన నీరు కావాలని, గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా గ్రామాలు దత్తత తీసుకొని ఆరోగ్య రిత్య గాని నీటి సమస్యలు వీరి ద్వారా చేయడం అభినందనీయ మన్నారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ద్వారా ఉద్యోగాలు గాని చదువు పరంగా సహాయం చేస్తామన్నారు.రాయలసీమ ఇంచార్జ్ డాక్టర్ రవిరాజు సహకారముతో వాటర్ ప్లాంట్ ని మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.. అన్నమయ్య, కడప జిల్లా ల ఇంచార్జ్, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా చెర్లోపల్లి, తాళ్లపాక, మదనగోపాలపురం, ఒంటిమిట్ట రాచపల్లి, జ్యోతి కాలనీ దత్తత తీసుకున్న సందర్భంగా మెడికల్ క్యాంప్స్ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామం లో అనారోగ్యం ఉన్న వారి ని తిరుపతి హాస్పిటల్ కి పంపించి ఉచితంగా ట్రీట్మెంట్ చేయడమైనదన్నారు. ఇప్పటికీ కంటి ఆపరేషన్ 100మందికి ఉచితం గా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ తిరుపతి లో చేయించడమైనదన్నారు. ఈ కార్యక్రమం లో హోటల్ ఎస్ ఆర్ గ్రాండ్ మేనేజింగ్‌డైరెక్టర్ చేజర్ల సుబ్రహ్మణ్యం రాజు, హెచ్ గ్లోబల్ ఫౌండేషన్ లైసన్ ఆఫీసర్స్ కోనేటిరవిరాజు, డి. శివరామరాజు, అంజన్ రాజు, విశ్వనాధ్ రాజు, జయకృష్ణమ రాజు, సుబ్బరామ రాజు, వెంకటయ్య నాయుడు, సురేష్ రాజు, శంకర్ రాజు, విజయరామరాజు, సుబ్బరాజు,లక్ష్మీదేవి, చంద్రరాజు, నరసింహారాజు, బంగార్రాజు, ఎస్, రాంచంద్రరాజు,శ్యామల, అరుణ, ఇందిరమ్మ, వెంకటసుబ్బమ్మ, రుద్రనారాయణ రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అడవిని తలపిస్తున్న స్మశాన వాటిక



తంబళ్లపల్లె స్మశాన వాటిక లో పెరిగిన పిచ్చి మొక్కలు.

**తంబళ్లపల్లె మే 2 ప్రభాతవార్త ః**
తంబళ్లపల్లె పేరుకే నియోజకవర్గ కేంద్రం అయితే కనీసం స్మశాన వాటిక లేక స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతం. దశాబ్దాలుగా తంబళ్లపల్లెకు సమీపంలోని అక్కమ్మ చెరువు కట్ట కింద మృతదేహాలను ఖననం చేయడం పరిపాటి. తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో సుమారు నాలుగువేల జనాభాకు పైగా అన్ని వర్గాల ప్రజలు ఉన్నారు. స్మశాన వాటిక లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మశాన వాటిక శుభ్రం చేయకపోవడంతో కంపచెట్లతో నిండి అడవిని తలపిస్తోంది. ఎవరైనా చనిపోతే పాతి పెట్టడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతుండగా ఒక్కోమారు తవ్వినచోట పుర్రెలు, ఎముకలు బయటపడడం పరిపాటిగా మారింది. స్మశాన వాటిక ఏర్పాటుపై గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలోని ప్రజల సౌకర్యార్థం స్మశాన వాటిక కు స్థలం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## నేటి నుంచి భగవద్గీత శిక్షణ తరగతులు

**ప్రొద్దుటూరు అర్బన్, మే 2 ప్రభాతవార్త :**
మే 3వ తేది నుండి 25 వరకు ఉదయం730 నుండి 930 వరకు భగవద్గీత గీత వేసవి శిక్షణా తరగతులు పట్టణంలోని ఎంవీఎస్ శ్రీ కైవల్య సత్సంగం ధ్యాన మందిరములో ప్రారంభమవుతాయని,గత 15 సంవత్సరముల నుండి భగవద్గీత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నమని, 4వ తరగతి నుండి 7 వ తరగతి వరకు జూనియర్స్ విభాగము,8వ తరగతి నుండి 10వ తరగతి వరకు సీనియర్స్ విభాగములో గీత పోటీలు నిర్వహించి మొదటి,రెండవ,మూడవ బహుమతులు ప్రధానము పోటీలో పాల్గొన్న వారందరికీ ఎప్పటిలాగే కన్సోలేషన్ బహుమతులు అందచేస్తామని శ్రీ కైవల్య సత్సంగం సభ్యులు ఒక ప్రకటలో తెలిపారు.

## భువనగిరి లక్ష్మీనరసింహస్వామి గర్భాలయం
## వెండి తాపడం కోసము గల్లా 10 లక్షల వితరణ



**రాజంపేట అర్బన్, మే2 ప్రభాతవార్త**
జాతీయ రహదారి పక్కనే వెలసిన శ్రీ భువనగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నకు ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా గుండయ్య గర్భాలయం వెండి తాపడం కోసము 10 లక్షల వితరణ చేస్తానని ప్రకటించారు. శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి సభ్యులు గల్లా గుండయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భువనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాశస్త్యం ఎంతో గొప్పది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత మోదుగుల పెంచలయ్య,మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## అరటి పంట నష్టం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి



**వేంపల్లె :మే, 02.(ప్రభాత వార్త)**
ఆకాల వర్షంతో పాటు ఈదురు గాలులతో నష్ట పోయిన అరటి పంట రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హార్టీకల్చర్ ఎఓ రెడ్డయ్యతో కలిసి ఈదురు గాలులతో నష్టం జరిగిన అరటి తోటలను టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పరిశీలించారు. అలాగే రైతులతో పంట నష్టంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ హార్టీకల్చర్ అధికారులు పంట నష్టంకు చెందిన నివేదికలను తయారు చేయాలని కోరారు. అరటి పంట ద్వారా నష్టపోయిన ప్రతి రైతుకు ఆదుకొనేందుకు పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ద్వారా సిఎం దృష్టికి తీసుకొని వెళ్తామని చెప్పారు. ప్రకృతి కనకరించక పోవడంతో రైతులకు నష్టాలు వస్తున్నట్లు చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పండ్ల తోటలకు కూడ ప్రభుత్వం చేయూత ఇస్తున్నది చెప్పారు. అధికారులు కూడ రైతులకు న్యాయం జరిగే విధంగా తోటలు వలన నష్టపోయిన రైతుల పేర్లను నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తెలంగాణ వలి, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు తో పాటు రైతులు పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీ పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్



**బద్వేల్ అర్బన్, మే 2, ప్రభాతవార్త**
పురపాలక సంఘం లోనీ శ్రీ కృష్ణదేవరాయనగర్ సచివాలయ పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పర్యవేక్షించారు.ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది ఎంతో మర్యాదపూర్వకంగా పెన్షన్లను అందజేయడం జరిగింది.

## శ్రీ శ్రీ కి ఘన నివాళి

**ప్రొద్దుటూరు అర్బన్,మే 2 ప్రభాతవార్త :**
శ్రీశ్రీ 115వ జయంతి సందర్భంగా శనివారం కౌతా పూర్ణానంద కళావేదికలో ఆయన చిత్రపటానికి ఓఎస్డి టు గవర్నమెంట్ విప్ ఏపీ అసెంబ్లీ ఏం ప్రభాకర్ శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలను అలంకరించి నివాళులర్పించారు. తదుపరి శ్రీ శ్రీ గురించి పలు విషయాలు ప్రశాంగించారు. తెలుగు కళావాహిని, జిఆర్కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై రాగ లహరి సమర్పణలో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను పరవశింపచేసింది. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షించారు. మల్లాది స్వాతి, సూర్య కామేశ్వరి, డేవిడ్ రాజు, దుర్గాప్రసాదరావు, అయ్యప్పన్, జోసఫ్, మస్తాన్ వలి, బ్రహ్మం తదితరులు పలు చిత్రాలలోని పాటలను శ్రావ్యంగా పాడి వినిపించారు.



## అసంఘటిత కార్మికుల అవగాహన వారోత్సవాలు

**కడప లీగల్, మే 2, ప్రభాతవార్త:**
ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డా.సియామిని వారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ వివిధ రంగాలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాలు, వారోత్సవాలను ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. 2వ రోజు శుక్రవారం నగరంలోని సంధ్యా సర్కిల్‌లో అసంఘటిత కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులు, గృహ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకురావాలని లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబరు 15100 నంబరును సంప్రదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటరీలు జిలానీ, సురేష్ సహాయం, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

## పురపాలక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన కమిషనర్

:ఒక్కరోజులోనే 34,72,000 ప్రాపర్టీ టాక్స్ వసూలు

:సిబ్బందిని అభినందించిన కమిషనర్



**బద్వేలు అర్బన్, మే 2 ప్రభాతవార్త:**
మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల వెంకటనరసింహారెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వారి మన్ననలు పొందిన విషయం విధితమే. కాగా ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో వేసవికాలంలో ప్రతి సంవత్సరం నీటి సమస్యతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటూ నీటికోసం ఆయా రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కొన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పొందుతుండేవారు.అలాగే మున్సిపాలిటీలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న ట్లుగా ఏ వార్డులో చూసినా చెత్తా, చెదారం పేరుకుపోయి మురికినీరు ఉండేది. అయితే బద్వేలు మున్సి పాలిటీలో అన్ని వార్డులలో తిరిగి మార్నింగ్ వాక్‌లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారు డ్లలో సమస్యలు పరిష్కరించాలంటేమున్సిపల్ సిబ్బంది అన్ని వార్డులలో తిరుగుతూ ప్రతిరోజూ చెత్తను స్తం భించిన డ్రైనేజీ కాలువలను పరిశుభ్రం చేయించేందుకు ముందుగా మున్సిపల్ సిబ్బంది వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి వారు శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి అన్ని వార్డులలో సకాలంలో డైలీవారి చెత్తను తొలగించడం, డ్రైనేజీ కాలువల పరిశుభ్రత, మున్సిపల్ వాటర్ సకాలంలో సరఫరాచేయడంలో సఫలీకృతులయ్యారు. అలాగే అంధకారంలో ఉన్న కొన్ని వార్డులలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రజల ద్వారా ఒకే రోజు పన్నుల రూపంలో 34,72,000లు వసూలు అయినట్లు తెలిపారు. పన్నులు వసూలు చేయ డంలో మున్సిపల్ సిబ్బంది ఎంతగానో శ్రమించారని తమ సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఇందుకు సహకరించి ప్రజలు , వ్యాపారులు తదితరులకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇలా ప్రజలు అందించే ప్రోత్సాహంతో రాబోయే రోజులలో మరిన్ని మెరుగైన సేవలందించేందుకు మరింత కృషిచేస్తామన్నారు.

# మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

**పీలేరు మే 2 ప్రభాతవార్త :**

పీలేరు నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశానికి నియోజకవర్గ తెదేపా నాయకులు కంభం నిరంజన్ రెడ్డి, తెదేపా కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వలిగట్ల, మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమోళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులతో కలిసి హాజరయ్యారు. తదుపరి మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకిపురం కలికిరి మండలాల మధ్య ఉన్న ఏపీఐఐసీ భూముల్లో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు ఎన్నికల్లో భారీ మెజార్టీ వచ్చేందుకు కృషి చేసిన నియోజకవర్గ మహిళల రుణం తీర్చుకుంటామన్నారు రాబోవు రోజుల్లో మంజూరయ్యే పక్కా గృహాలన్నీ మహిళల పేరుతోనే ఇస్తామన్నారు. త్వరలోనే ఇళ్లు లేని నిరు పేదలందరికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందే విధంగా మహిళా సంఘాల నుంచి రుణాలు ఎక్కువ శాతం అందే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

అందించే సంక్షేమ పథకాలను అర్హులైన మహిళలు పొంది లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు స్థానిక సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రచారి, మురళి, కేకే, రమేష్, పీసీ, గాందీపేట రమణ, సయ్యద్ బాషా, డిష్ బ్రదర్స్, బొక్కసం రామకృష్ణ ఆనంద, యూసఫ్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన



**దువ్వూరు, మే 02, ప్రభాతవార్త:**

చట్టరిత్యా బాల్య వివాహాలు చేయడం నేరం అని వాటిపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో అంగన్వాడి కేంద్రం నందు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగ ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను 18సంవత్సరాల వయసు వరకు పెళ్లి చేయకుండా చదివించాలన్నారు. చిన్న వయసులో పెళ్లి చేస్తే మహిళలు ఎదుర్కొనే సమస్యలను గురించి వివరించారు. ప్రసవం సమయంలో ఎదుర్కొనే సమస్యలను కూడ తెలిపారు. ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల హక్కు చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి రూపా, రమాదేవి పాల్గొన్నారు.

# మొదలైన గంగ జాతర ఉత్సవాలు

**దువ్వూరు, మే 02, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఏకోపల్లె గ్రామంలో గంగమ్మ, అంకాలమ్మ, చౌడేశ్వరి దేవాలయం నందు శుక్రవారం గంగ జాతర ఉత్సవాలు మొదలయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం గ్రామ దేవతకు పూజలు, అభిషేకాలు, అమ్మవారికి అలంకరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 2వ రోజు శనివారం సిద్ధ ముక్తి యాగం, పొంగు పాల యాగం, అలాగే షమీ వృక్ష యాగం, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు గంగమ్మ వేశధారణ జరుగుతుందని అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 4వ తేది ఆదివారం పాలేటి యాగం, గ్రామ బోనాలు, మట్టిమాను యాగం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని భక్తులందరూ పాల్గొనాలని గ్రామస్థులు తెలిపారు.

# మహిళలకు శక్తి యాప్, బెట్టింగ్ నష్టాలు, సైబర్ భద్రతపై అవగాహన సదస్సు

**మదనపల్లెక్రైమ్, మే 2 ప్రభాతవార్త.**



రైజ్డ్ ఆన్ డెనిమ్ వస్త్ర తయారీ కంపెనీలో పనిచేస్తున్న మహిళల కోసం శుక్రవారం శక్తి యాప్ మరియు సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గాయత్రి మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ యొక్క ఉపయోగాలను వివరించారు. ఆపద సమయంలో ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించడం ఎలాగో తెలియజేశారు. అనంతరం, బెట్టింగ్ యాప్‌ల వల్ల జరిగే ఆర్థిక నష్టాలు మరియు ఆన్‌లైన్, సైబర్ నేరగాళ్ల పట్ల మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అలాగే, మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, దీని వల్ల జరిగే ప్రమాదాల గురించి తెలియజేశారు. ఈ అవగాహన సదస్సులో శక్తి టీమ్ సభ్యులు శశికళ, లత, వీణ, ముని కుమార్ నాయక్, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# నాటుసారా స్వాధీనం వ్యక్తి అరెస్టు

**నిమ్మనపల్లె, మే 2 ప్రభాతవార్త :**

గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుంచి పదిలీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అగ్రహారం పంచాయితీ ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన పెద్దరామయ్య కుమారుడు లక్ష్మయ్య తన ఇంటి వద్ద నాటుసారాను అమ్ముతుండగా సిబ్బందితో కలసి దాడులు చేసి పట్టుకొన్నామన్నారు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

# నిమ్మనపల్లె ఆర్ఐగా రమేష్

**నిమ్మనపల్లె, మే 2 ప్రభాతవార్త :**



నిమ్మనపల్లె తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా ఇటీవల రమేష్ పదవీబాధ్యతలు చేపట్టారు. పెద్దమండ్యం మండలం నుంచి బదిలీపై నిమ్మనపల్లెలో బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వాసులకు ఎళ్లవేలా అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తానన్నారు.

# చేపల వేటకోసం వెళ్ళి వ్యక్తి మృతి

**నిమ్మనపల్లె, మే 2 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయితీ ఆచార్లపల్లె సమీపంలోని ముసలినాయుని చెరువులో శుక్రవారం శవం తేలియాడు కనపడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని రాచవేటి వారిపల్లె నివాసి మల్లయ్య కుమారుడు జనార్ధన్(40) గత మూడు రోజుల క్రితం ముసలినాయిచెరువులో చేపల కోసం వెళ్ళాడు. చెరువులోని చేపలకోసం వలవేసి ప్రమాదవశాత్తు నీటిమునిగి మృతి చెందనడం జరిగిందన్నారు. మృతదేహం నీటిలో తేలియాడుతూ ఉంటే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుని వివరాలు సేకరించారు. చేపలకోసం వెళ్ళి మృతి చెందినట్లు గుర్తించిన పోలీసులు మృతుని భార్య చిన్న బుజ్జి గుర్తించడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


మృతదేహం

# అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బొలిశెల్లి శ్రీనివాసులు

**కమలాపురం మే 2 ప్రభాతవార్త**



కమలాపురం జూనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా బొలిశెట్టి శ్రీనివాసులును నియమించినట్లు లా డిపార్ట్మెంట్ వారు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శ్రీనివాసులు శుక్రవారం కమలాపురం కోర్టులో ఏజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2007లో కమలాపురం కోర్టులో న్యాయవాదిగా ఎన్రోల్ చేసుకున్నారు. 2015 నుంచి 2021 వరకు ఎర్రగుంట్ల మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్గా సేవలందించారు. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్యానల్ అడ్వకేట్గాను, ఎస్ఐసీ ప్యానల్ అడ్వకేట్గానూ కొనసాగుతున్నారు. కాగా ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాలకు సంబంధించిన కేసులను వాదించడానికి ప్రభుత్వం ఆయనను ఏజీపీగా నియమించింది.

# టిప్పర్ ఢీకొని మహిళ మృతి

**రాజంపేట అర్బన్, మే2 ప్రభాతవార్త ;**

రాజంపేట పట్టణం సమీపంలోని జాతీయ రహదారి పై అశోక్ గార్డెన్స్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడక్కడే దుర్మరణం చెందింది. చిట్వేలి మండలం నాగవరం చెందిన మురి అనిత (28) ఓబులవారిపల్లి మండలం ముక్కావారి పల్లెలోని తన పుట్టింటికి వెళ్ళింది. తిరిగి ఆటోలో వస్తుండగా రాజంపేట సమీపంలో ఢీకొనడంతో అక్కడికనే మరణించింది. ఆటో డ్రైవర్ అంజికి తీవ్ర గాయాలు అయ్యాయి. కలప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పాఠశాలలు తెరిసే నాటికి పాఠ్య పుస్తకాలు


పీలేరు చేరిన పాఠ్య పుస్తకాలను సరిచేసుకుంటున్న ఎంఈఓ, సిఆర్‌పిలు

**పీలేరు మే 2 ప్రభాతవార్త :**

పాఠశాలలు తెరిసే నాటికి 100 శాతం పాఠ్య పుస్తకాలు ప్రతి విద్యార్థికీ అందజేస్తామని పీలేరు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి అన్నారు. పీలేరు మండలంలోని 76 పాఠశాలల్లో 6,207 మంది విద్యార్థులున్నారని అన్నారు. ఇప్పటివరకు మండలానికి 70 శాతం పాఠ్య పుస్తకాలు తమ కార్యాలయానికి అందాయని ఎంఈఓ చెప్పారు. మిగిలిన 30 శాతం పాఠ్య పుస్తకాలు కూడా పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా వచ్చేస్తాయని ఎంఈఓ తెలిపారు. కూటమి ప్రభుత్వం 2025 26 విద్యా సంవత్సరం నుండి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు కూడా అందజేస్తామని ఎంఈఓ తెలిపారు. వీటితోపాటు యూనిఫామ్, టై, బెల్టు, బూట్లు కూడా అందజేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఈ మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యా విధానంలో సమూల మార్పులతో ప్రారంభించనున్నట్లు ఎంఈఓ చెప్పారు.

# కులగణన పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

**ప్రొద్దుటూరు మే 2 ప్రభాతవార్త**



భారతదేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి బీసీ కులాల ఆకాంక్ష మేరకు బీసీ కులాల జనాభా లెక్కలు సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ వెంకట కృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన పత్రిక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం కుల గణన చేయాలన్న నిర్ణయం తీసుకోవడంలో బీసీ సంఘాల దశాబ్దాల పోరాట ఫలితమేనని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ నేతృత్వంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలలో దశల వారిగా చేసిన ఉద్యమ పోరటాలు అభినందనీయమని అన్నారు. కులాల వారీగా బీసీ జనాభా లెక్కలు సేకరించడం వల్ల బీసీ కులాలకు ప్రభుత్వం కేటాయించే బడ్జెట్ విషయంలో కానీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయి వర్గాలకు చేరడం లో గానీ, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలైన చట్టసభలలో జనాభా ప్రాతిపదికన మేమెంతో మాకంత అనే రీతిలో మన వాటాలు, హక్కులు సాధించుకునేందుకు అవకాశం ఉందన్నారు. మన రాజ్యాంగ ఫలాలు సామాజికంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు సమానంగా దక్కించునేందుకు ఏకైక పరిష్కార మార్గం బీసీ కులగణన మాత్రమేనని తెలిపారు. అత్యధిక శాతం ప్రజల ప్రధాన సమస్యను పరిష్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# మహాధర్నాను జయప్రదం చేయండి

## జిల్లా అధ్యక్షులు రూపక్‌నాయక్

**మదనపల్లె, మే 2 ప్రభాతవార్త :**

చలో విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలని అన్నమయ్యజిల్లా అధ్యక్షులు రూపక్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిలో 98మంది ఎస్సి, ఎస్టి పోలీస్‌స్టేషన్ల డిఎస్‌పిలను వెంటనే నియమించాలన్నారు. 2024లో డిఎస్‌పిలను రద్దు చేయడం జరిగిందని బహుజన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పిలను రద్దు చేసినప్పటికి కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకొన్న తరువాత ఈ విషయంపై ఏ మాత్రం సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కారం చేయకుండా చట్టాన్ని నీరుకార్చేవిధంగా ప్రభుత్వం వ్యవరిస్తే తిరుగుబాటు చేస్తామని తెలిపారు. అందుకు రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి సంఘాలను, ఇతర ప్రజాసంఘాలను, రాజకీయ పార్టీలను ఏకం చేసి విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బహుజన బిసి అధ్యక్షులు రాఘవేంద్రయాదవ్, జిల్లా అధ్యక్షులు హరిబాబు, శివశంకర్, లక్ష్మినారాయణ, మిథున్, చైతన్య, రెడ్డిశేఖర్, నవీన్, జెనీత్; హరినాయక్, రోహిత్, కళా, ప్రభావతి, నారాయణమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**రామసముద్రం మే 2 ప్రభాతవార్త**



కుటుంబ పోషణకు గ్రామ దేవత ఫోటోతో ఊరూరా తిరుగుతూ జీవనం సాగిస్తున్న ఓ అభాగ్యుడు కరెంట్ షాక్‌తో మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రవికుమార్ వివరాల మేరకు కడప జిల్లా నందలూరు మండలం పాతూరు గ్రామానికి చెందిన చెన్నయ్య కుమారుడు సుబ్రమణ్యం 36 గ్రామ దేవత ఎల్లమ్మ తల్లి ఫోటో పెట్టుకుని ఆటో లో ఊరూరా తిరుగుతూ డబ్బులు సంపాదిస్తూ కుటుంబ పోషణ చేస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం రామసముద్రం మండలం కమ్మవారి పల్లి గ్రామానికి వచ్చాడు. రాత్రి 11 కెవి కరెంటు లైన్ నుండి తన ఆటోలోని బ్యాటరీకి కనెక్షన్ ఇచ్చుకోవాలని ప్రయత్నంలో ఎలక్ట్రికల్ షాక్ తగిలి చనిపోయాడు. భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

# అంగన్వాడి సెంటర్ నందు కిశోర బాలికల వికాసం

**సుండుపల్లి, మే02, ప్రభాత వార్త :**



మండల పరిధిలోని తిమ్మసముద్రం వడ్లపల్లి అంగన్వాడీ కేంద్రం, మరియు దూది మాదిగ పల్లె, సిద్ధారెడ్డిగారిపల్లె అంగన్వాడి సెంటర్ల నందు ఐసిడిఎస్ రాయచోటి పిఓ పద్మ లక్ష్మి, సూపర్వైజర్ వెంకటలక్ష్మమ్మ, విజయలక్ష్మి ఆధ్వర్యంలో కిశోర బాలికల వికాసం జరపడం జరిగింది. రాయచోటి ఐసిడిఎస్ పిఓ మాట్లాడుతూ ప్రతి నెల మే 2వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, బాలల హక్కులు, రక్షణ, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఆన్లైన్లో భద్రత, విద్య యొక్క ప్రాముఖ్యత, బాల్య వివాహాల వలన జరిగే నష్టం గురించి ఇంకా పలు విషయాలు గురించి తెలియజేశారు. అలాగే మే 2వ తేదీ నుండి అన్ని మండలాల్లో, గ్రామాలలో ఈ ప్రోగ్రామ్ నిర్వహించపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కొండమ్మ మాట్లాడుతూ 11 14,1518 పిల్లలందరూ కిషోర్ బాలికల ఎందుకు వస్తారని కనుక అందరూ సూపర్వైజర్ చెప్పిన విషయాలను గుర్తు చేసుకోవాలని తెలియ జేసింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా సువర్ణ, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**ముద్దనూరు, మే 02 ,ప్రభాతవార్త:**



స్థానిక పట్టణం లోని అంగన్వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం కిశోరి బాలికల వికాసంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిడిపిఓ ముంతాజ్ బేగం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలబాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, చట్టాల పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా పోలీసు ఆకాంక్ష మాట్లాడుతూ కిశోరి బాల,బాలికలు కౌమార దశలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆన్లైన్ మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కిశోరి బాల,బాలికల వికాసంపై జూన్ 10వరకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమారాణి పాల్గొన్నారు.

# మిట్స్‌లో టెక్నికల్ సింపోజియం

**కురబలకోట మే 2 ప్రభాతవార్త**



మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్) విభాగము వారు జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోసియం డిఫెస్టా 2కె25 కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆశిష్ చద్దా, సీనియర్ డైరెక్టర్, ప్రోగ్రామ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఎల్ టి ఐ మైండ్‌ట్రీ మరియు మనోగ్నా నాదెళ్ల, ప్రిన్సిపల్ డేటా సైంటిస్ట్, ఐపాలెట్, బెంగళూరు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆశిష్ చద్దా మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ పై స్కిల్స్ పెంచుకోవాలని అన్నారు. ప్రస్తుత దృశ్యంలో, కృత్రిమ మేధస్సు (AI), మెషిన్ లెర్నింగ్ (ML), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ మరియు ఆటోమేషన్ వంటి కీలక ధోరణులు పరిశ్రమలు పనిచేసే మరియు ఆవిష్కరణలు చేసే విధానాన్ని పునర్నిర్మిస్తున్నాయి అని అన్నారు. సంస్థలు ఇప్పుడు పైథాన్, ఆర్ R, ఎస్.క్యూ.ఎల్ (SQL) మరియు టేబుల్యు వంటి సాధనాలలో సాంకేతిక నైపుణ్యాన్ని కలి గి ఉండటమే కాకుండా బలమైన సమస్య పరిష్కారం మరియు డొమైన్‌నిర్దిష్ట జ్ఞానాన్ని కలిగి ఉన్న ప్రతిభను కోరుకుంటున్నాయి అని, వీటి పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కార్యాలయానికి వీడని గ్రహణం

**తంబళ్లపల్లె మే 2 ప్రభాతవార్త ః**


తంబళ్లపల్లె తాసిల్దార్ కార్యాలయం.

గత నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన తహసిల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని గత వర్షాకాలంలో పరిస్థితి విషమించి విధి లేని పరిస్థితుల్లో కార్యాలయాన్ని పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌కు మార్చడం జరిగింది. పురాతన తాసిల్దార్ కార్యాలయం మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సౌకర్యంగా ఉండేది. నేడు కార్యాలయం సుదూర ప్రాంతంలో ఉండడంతో అధికారులు అందుబాటులో ఉన్నా అక్కడికి వెళ్ళడానికి రైతులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయం మార్చడంతో నాడు రైతులతో కళకళలాడిన కార్యాలయం నేడు రైతులు లేక కార్యాలయం బోసిపోతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, నేటి కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన తాసిల్దార్ కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ప్రజలు ప్రశాంతంగా జీవించాలి

**దువ్వూరు, మే 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నారాయణ పల్లె గ్రామ ప్రజలు వ్యక్తిగత కక్షలు వీడి ప్రశాంతంగా జీవించాలని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ఫ్యాక్షన్ గ్రామమైన నారాయణ పల్లెలో నాకా బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నాయకుల ఇళ్లను క్షున్నంగా పరిశీలించారు. ఎక్కడైన మరణాయుధాలు, బాంబులు వంటివి ఉన్నాయోమో అని తనిఖీ చేశారు. రికారులు సక్రమంగా లేని 7వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పిల్లలను చక్కగా చదివించుకొని అభివృద్ధిలోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌కుమార్, చాపాడు, ఖాజీపేట, బీ.మఠం ఎస్ఐలు పాల్గొన్నారు.



# 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

**పెనగలూరు మే 2 ప్రభాతవార్త**

2025,26 వ సంవత్సరానికి ఏపీ మోడల్ స్కూల్ పెనగలూరు లో 6వ తరగతి ప్రవేశానికి 21 తేదీన జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విలువడినవి. సదరు ఫలితాలు జాబితా ఏపీ మోడల్ స్కూల్ పెనగలూరులో స్కూల్ నోటీస్ బోర్డ్ నందు ఉంచబడినవి అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సి తెలిపారు.

# అర్హులందరికీ స్థలం కేటాయిస్తాం

**పెద్దమండెం మే 2 ప్రభాతవార్త**


మాట్లాడుతున్న తహసిల్దార్ సయ్యద్ అహ్మద్

గ్రామ వార్డు సచివాలయాల ఆధారంగా అర్హులందరికీ హౌసింగ్ కాలనీలను స్థలం కేటాయించి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ఆదేశాలు ఆధారంగా ప్రతి ఒక్కరికి గ్రామాల్లో మూడు సెంట్లు భూమిని కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం లే అవుట్లను ఏర్పాటు చేసి కాలనీ ఇంటిని నిర్మించిస్తుందని తహసిల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు పెద్దమండెం ముసలికుంట సిద్దవరం బండమీద పల్లెల్లో అర్హులైన వారికి ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ ఏర్పాటులకు స్థలాలను సేకరించి లేఅవుట్ల ద్వారా ఇంటి నిర్మాణాన్ని చేపడతామన్నారు అందుకు అర్హులైన వారు దరఖాస్తులు ఆన్లైన్ లో చేసుకోవాలని కోరారు అలాగే పోషణ ద్వారా సెటిల్మెంట్ ల్యాండ్లను డీకేటి ల్యాండ్లను గుర్తించి మంచి లేఅటుకో ఏర్పాటు చేస్తామన్నారు పొందిన ఇండ్లకు కూడా పట్టాలను అందిస్తామన్నారు గ్రామంలో 200 లకు పైగా ఇండ్లను పంపిణీ చేస్తామన్నారు అయితే దరఖాస్తులను ఆన్లైన్లోనే పొందుపరచాలన్నారు హౌసింగ్ ఫర్ ఆల్ అనే నినాదంతో ప్రభుత్వం ఇండ్లను నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని మండలంలోని అర్హులైన వారు వినియోగించుకోవాలని కోరారు.

# వైఎస్.షర్మిల హౌస్ అరెస్టు అప్రజాస్వామికం

## కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె.బాష

**మదనపల్లె, మే 2 ప్రభాతవార్త :**



ఏపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల హౌస్ అరెస్టు అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె.బాషా ఖండించారు. శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలిని గృహనిర్బందంలో ఉంచడం భావ్యం కాదన్నారు. పిసిసి కార్యాలయానికికూడా వెళ్ళనీయకుండా చేయడాన్ని ఆయన ఆక్షేపించారు. రాష్ట్ర అధ్యక్షురాలిని హౌస్ అరెస్టు చేయడమంటే రాజ్యాంగాన్ని కాలరాయడమే అన్నారు. ప్రభుత్వం ఇకనైన తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. వైఎస్.షర్మిల ఉద్దండరాయునిపాలెంలో పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ఇంటివద్ద మోహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీని గౌరవించి వారి సలహాలను, సూచనలు స్వీకరించాలన్నారు. ప్రభుత్వం సమర్థవంతమైన పరిపాలన సాగించి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికావస్తున్న ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఏద్దేవా చేశారు.

# కులగణన నిర్ణయం చారిత్రాత్మకమైంది

## బిజెపి నాయకులు భర్నేపల్లి రవికుమార్

**మదనపల్లె, మే 2 ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కులగణన నిర్ణయం చారిత్రాత్మకమైందని బిజెపి సీనియర్ నాయకులు బర్నేపల్లి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విపక్ష రాజకీయాలకు చెక్‌పెట్టకొన్నామన్నారు. ప్రజల సంక్షేమంపై ఏనాడు ప్రతిపక్షాలు ఆలోచించకుండా కులగణన పేరుతో రాజకీయాలు మాత్రమే చేశాయని ఆరోపించారు. వెనుకబడిన వర్గాల సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బిజెపి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. జనాభా లెక్కల్లో కులగణన చేర్చాలని నిర్ణయం చారిత్రాత్మకమైందని అభివర్ణించారు. అణగారిన వర్గాల పురోగతికి ప్రధాని నరేంద్రమోడీ తీసుకొన్న నిర్ణయం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. దేశంలో సామాజిక నిర్ణయాన్ని బలోపేతం చేయడం వైపు అడుగులు వేస్తోందన్నారు. ఈ నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏ సమాజ ప్రయోజనాలకు హాని కలిగించకుండా రిజర్వేషన్‌లను న్యాయంగా అమలు చేయడానికి మార్గం దోహదపడిందన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్‌కు విద్యార్థులు ఎంపిక

**బద్వేలు, మే 2, ప్రభాత వార్త**



బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని శీలం వారిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న శీలి దీక్ష ,శీలి యశ్వంత్ అనే విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెలలో ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశం కొరకు జరిగిన ప్రవేశ పరీక్షలో నరసాపురం మోడల్ స్కూల్‌కు ఎంపిక కావడం జరిగిందని సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుడు మానుగుంట రవిశంకర్ తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నర్సాపురం మోడల్ స్కూల్ కు ఐదు మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచి ఎంపికయ్యారని, ఈ సంవత్సరం ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజులలో మోడల్ స్కూల్, గురుకులం, నవోదయ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారి ఎంపికకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# పారిశుద్ధ్య పనులు చేపట్టిన కార్మికులు

**రామసముద్రం, మే 2 ప్రభాతవార్త**



రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామ పంచాయతీలోని ఎగువ హరిజనవాడలో శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో గపూర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్‌లో చెత్తాచెదారాన్ని దిబ్బగా తయారుచేసిన రోడ్డును పారిశుధ్యపు కార్మికుల చేత శుభ్రం చేయించడం అయినది. అలాగే గ్రామ పంచాయతీకి సంబంధించిన డంపింగ్ యార్డ్ ను పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను సేకరించి చెత్తను తరలించి వేరు చేసే విధానాన్ని క్లుప్తంగా తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గఫూర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్,ఎంపీటీసీ క్రిష్ణప్ప మరియు కార్మికులు పాల్గొనడం జరిగింది.

# బాలికల భవితకు కిశోరీ వికాసం

**గాలివీడు, మే 2(ప్రభాతవార్త):**



బాలికల భవితకు కిశోరీ వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, సోనీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం, నూలివీడు సెక్టార్లలో కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వార్డు, గ్రామ సచివాలయాలలో ఈ నెల 2 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు బాలికలకు 12 అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలు, కౌమార బాలికల నాయకత్వం, సాదికారిత తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## కులగణన నిర్ణయం చారిత్రాత్మకం

**బిజెపి నేత పోతుగుంట రమేష్ నాయుడు**



రాజంపేట అర్బన్, మే2 ప్రభాతవార్త

కులగణనచేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల బిజెపి ఇన్చార్జి పోతు గుంట రమేష్ నా యుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి బిజెపి నేతలు, స్థానికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, ప్రజాభిప్రాయం మేరకు, సామాజిక సమరసతను దృష్టిలో ఉంచుకుని నిర్ణయించడం గొప్ప నిర్ణయం అన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కుల గణన పేరుతో స్వార్థపూరిత రాజకీయాలకు తెరలేపాయని మండి పడ్డారు. దీన్ని రాజకీయ అస్త్రంగా వాడుకుని ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేందుకు ప్రయత్నించాయని విమర్శించారు. కానీ ప్రజాప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు వివి రమణ, పట్టణ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు డాక్టర్ వేణు ప్రసాద్, మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ కార్యదర్శి ఎన్ గిరీష్, బిజెపి పార్లమెంట్ నాయకులు తోట నగేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెనుగొండ రమణ ,బిజెపి నాయకులు కృష్ణ, మురళి, లక్ష్మీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## పుల్లంపేటలో కిషోర్ వికాసం



మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి

పుల్లంపేట మే 2(ప్రభాతవార్త)

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలో కిషోర్ వికాసం కార్యక్రమాన్ని పుల్లంపేట పంచాయతీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మా ట్లాడుతూ కిశోర వికాసం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలబాలికల మానసిక శారీరక వికాసం గురించి అదే విధంగా వారి యొక్క భవిష్యత్తుకు సంబంధించిన అనేక రకాల విషయాలను గురించి మహిళా పోలీస్ నాగమణి అవగాహన కల్పించడం జ రిగింది. ఈ కార్యక్రమం మే నెల రెండో తేదీ నుంచి జూన్ నెల 10వ తరగతి వరకు జరుగుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట పంచాయతీ కార్యదర్శి ముత్యం,ఎంపీ యూపీ స్కూల్ టీచర్లు అశోక్,యుటిఎఫ్ నాయకులు రమణ మూర్తి, అంగన్వాడి వన్ సెంటర్ టు సెంటర్ టీచర్స్ శ్రీ లక్ష్మి, నాగ లత తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ




పెనగలూరు మే 2 ప్రభాతవార్త ..

మే డే సందర్భంగా అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలంలో ఏఐటిసి జెండాను వైభవంగా ఎగరవేయడం జరిగినది ఈ సందర్భంగా ఏ ఐ టి సి మండల అధ్యక్షులు ఏనుబోయిన చలపతి కామ్రేడ్ మాట్లాడుతూ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక కర్షక యొక్క హక్కుల కోసం సికాక్ నగరాన ఎంతోమంది కార్మికుల యొక్క రక్తాన్ని చిందించి ఈనాడు కార్మిక హక్కులను కాపాడారని తెలియజేశారు అదేవిధంగా ఈనాడు వచ్చిన ప్రభుత్వాలు కొత్త చట్టాలను తెచ్చి కార్మికుల యొక్క హక్కులను హరించి కార్మికుల యొక్క నడ్డి విరిస్తున్నారన్నారు కావున కార్మికులు అంతా ఐక్యతతో కలిసి హక్కులను కాపాడాలని తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏఐటిఈసి మండల కార్యదర్శి పందికాల రామయ్య కామ్రేడ్. రేవూరి రాజ శేఖర్. గానుగపెంట బాలసుబ్రమణ్యం ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## కిసార్ వికాస్



బద్వేలు మే 2 ప్రభాతవార్త ..

మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిరువెంగలపురం హెల్త్ వెల్నెస్ కేంద్రం నందు కిసార్ వికాస్ 1019 యుక్త వయస్సు ఉన్నటువంటి బాలికలకు పోషకాహారం గురించి వ్యక్తిగత పరిశుభ్రత గురించి ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించి భారత ప్రభుత్వం వారు మరియు రాష్ట్ర ప్రభుత్వం వారు ఈనెల రెండవ తారీకు నుంచి జూన్ 10వ తారీఖు వరకు కిషోర్ వికాసాన్ని ప్రోగ్రాం కింద 1019 సంవత్సరాల వయస్సు వారికి ఆరోగ్యం పైన పునరుత్పత్తి పైన పోషకాహారం పైన అవగాహన కల్పించాలని ఆదేశాలు ఇవ్వడమైనది అందుకు అనుగుణంగా ఈరోజు అనగా 2 /5/2025 వ తేదీన గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో కిషోర్ బాలికల అందరినీ పరిచయం చేసుకొని వారి ఆహారం అలవాట్లు గురించి ఫోషకాహారం గురించి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలుసుకొని వారికి ఆరోగ్యం పైన మరియు పోషకాహారం పైన అవగాహన కార్యక్రమం కల్పించడం. ఈ కార్యక్రమంలో హెల్త్ వెడికేటర్ బి వెంగయ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రవతి, హెల్త్ సూపర్వైజర్ కే వెంకటమ్మ మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సువరణ మరియు అంగన్వాడి సెంటర్ అంగన్వాడి టీచర్స్ ఆశా కార్యకర్తలు పి నాగమ్మ మహాలక్ష్మ తెలుగువారు పాల్గొనడం అయినది.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు పెంపు

ఎడ్యుకేషన్ మే 2 ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును మరో మూడు రోజులు పొడిగించారు. ఈ నెల 12 తేది నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి గడువును మరో 3 రోజులు అనగా 05.05.2025( సోమవారం) వరకు పొడిగించారు, కావున ఈ చివరి అవకాశాన్ని, ఇంతవరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు వినియోగించుకోవాలని బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ. ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమాచారాన్ని, అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు అధ్యాపకులు వారి కళాశాల విద్యార్థులకు తెలియపరిచారు.

## వైభవోపేతంగా శంకరాచార్యులవారికి అభిషేక పూజలు



ప్రత్యేక పూజలు అందుకున్న శంకరాచార్య, శారదా మాతలు



శంకరమఠంలో ఉపనయాలు జరుగుతున్న దృశ్యం

( అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

బ్రాహ్మణ అద్వైత సమితి రాజంపేట ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతిని శుక్రవారం స్థానిక శంకర్ మఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరమఠాన్ని దేదీప్యమానంగా విద్యుద్దీపాలంకరణ తో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అలాగే అభిషేక పూజలు నిర్వహించి బ్రాహ్మణ వటువులకు ధర్మోపనయనాలు నిర్వహించారు. అద్వైత సమితి కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ప్రగడ వల్లభరావు, కార్యదర్శి గంపర్తి సోమశేఖర్ శర్మ, కమిటీ కోశాధికారి అనిల్ కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ గురు, వేద పండితులు యజ్ఞేంద్ర కుమార్ శర్మ, వేదపండితుడు హరి కుమార్ శర్మల నేతృత్వాల్లో 5 మంది బ్రాహ్మణ వటువులకు సామూహిక యజ్ఞోపధారణలతో ఉపనయనములు చేయించు కొన్నారని చెప్పారు. గత మూడు రోజులుగా ఆది శంకరాచార్యుల వారికి శారదా మాతకు ఉదయంవేళలో ప్రధానార్చకులు చోంగుడి దశరథ రామ శర్మ అభిషేక పూజలు, సాయంసంధ్య వేళ అమ్మవారికి మహిళలచే కుంకుమార్చనలు నిర్వహించారని చెప్పారు. జగద్గురు ఆది శంకరాచార్యుల వారిని దర్శించుకున్న వారిలో ప్రముఖ ఆడిటర్ ఎస్ ఎస్ పంత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి కృష్ణ కుమార్, శరచ్చంద్ర, పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయింత్రం రాజంపేట పట్టణములో జగద్గురు ఆది శంకరాచార్యులు, శారదా మాత ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకరమఠానికి చెందిన ప్రగడ వల్లభరావు పాల్గొన్నారు.

## విద్యార్థులు భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలి

ప్రొద్దుటూరు అర్బన్, మే 2 ప్రభాతవార్త




జీవితంలో ప్రతి ఫేర్‌వెల్ ఒక కొత్త ప్రారంభానికి నాంది అని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి. జయరామి రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి. జయరామి రెడ్డి, ఆచార్య జి. జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఫెరేవెల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జయరామిరెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఫేర్‌వెల్ ఒక కొత్త ప్రారంభానికి నాంది అని తెలిపారు. భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలని సూచించారు. బీటెక్ తరువాత విద్యార్థులకు ఉన్న అవకాశాలను వివరించారు. కళాశాల డీన్ డాక్టర్ కెవి రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం టెక్నాలజీ వెనుక పరిగెడుతోందని, కావున ప్రతి ఒక్కరూ టెక్నాలజీని అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇతరులకు కొలువులు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మెకానికల్ హెచ్ఓడి ఆచార్య జయచంద్రరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు మీ జీవితం తల్లితండ్రుల మీద ఆధారపడి కొనసాగిందని, ఇక మీదట అలా కాకుండా అభివృద్ధి వైపు పయనించి మంచి ఉద్యోగాలు లేదా ఏదైనా ఇతర రంగాలలో నిలదొక్కుకోవాలని అంతేకాక ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని తెలిపారు. కళాశాలకు, అధ్యాపకులకు మరియు మీ తల్లితండ్రులకు మంచి పేరు గౌరవం తీసుకురావాలని అలాగే ఎంతోకొంత సమాజాసేవకు మీరు ఉపయోగపడాలని అన్నారు. అలాగే ఈ నాలుగు సంవత్సరాలలో మీకు వచ్చిన అవకాశాలు మీరు ఎదుర్కొన్న సవాళ్ళు నేటి సమాజంలో వివిధ రంగాలలో ఒక్కొక్కరి ఆలోచన విధానం ఒక్కో మాదిరిగా ఉంటుందని సమన్వయ పరచుకొని మంచి స్థాయికి ఎదగాలని అన్నారు. ఫైనలియర్ విద్యార్థులు మాట్లాడుతూ తాము వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేసుకున్నామని ప్రతి ఒక్కరం స్వయంగా ఆలోచించి అభివృద్ధి చెందడంతో పాటు తాము చదువుకున్న ఈ ఇంజనీరింగ్ కళాశాలకు మంచి పేరు తెస్తామని వివరించారు. తమ ఎదుగుదలకు తమ విజ్ఞానానికి మంచి పునాది వేసిన అధ్యాపకులకు ఈ సంధర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీనియర్లు, జూనియర్లు మంచి పాటలతో, నృత్యాలతో ఈ ఫెరేవెల్ పార్టీని అదరగొట్టారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఆచార్య డాక్టర్ సి. నాగరాజు, యంయంటి కోఆర్డినేటర్ యన్. హరినాథ రెడ్డి, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్యం, తాగునీటి పై ప్రత్యేక దృష్టి

**వేంపల్లె పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి**



వేంపల్లి : మే 02 (ప్రభాత వార్త):

వేంపల్లి పట్టణంలో పారిశుధ్యం పైన, తాగునీటి సమస్య పైన ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వేంపల్లి పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి ని కూటమి నాయకులు , వైసీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత 5 నెలలుగా పంచాయతీ సిబ్బంది కి జీతాలు చెల్లించడం లేదని పంచాయతీ సిబ్బంది ఈఓ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఈవో వెంటనే సిబ్బంది కి జీతాలు చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అనంతరం ఈఓ రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేంపల్లి పట్టణంలోని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య లేకుండా చూస్తామని అన్నారు. చెడిపోయిన తాగునీటి బోర్లను తయారు చేయిస్తామని చెప్పారు. అవసరం అయిన చోట నూతన బోర్లు వేయించి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని అన్నారు. ప్రజలు కూడా తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నూతన ఈవో రామ సుబ్బారెడ్డి ని శుక్రవారం వేంపల్లి వృషభాచలేశ్వర దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు పై ఈఓ తో చర్చించారు. ఈఓ ను కలిసిన వారిలో సింగారెడ్డి జయశంకర్ రెడ్డి, అఖిల భారత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులు చంద్రాయుడు , లక్ష్మణ్, రామ్మోహన్ , కృష్ణ, కూటమి నాయకులు, వైసీపీ నాయకులు ఉన్నారు.

## పంచాయితీ కార్యదర్శులతో సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిమ్మనపల్లె, మే 2 ప్రభాతవార్త :

మండలంలోని పంచాయితీ కార్యదర్శులతో డివిజన్ పంచాయితీ అధికారి నాగరాజు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయితీ కార్యదర్శి పన్నులకు సంబంధించిన స్వర్ణ పంచాయితీ పోర్టల్‌లో వందశాతం పూర్తి చేయాలన్నారు. పంచాయితీలో శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ శానిటేషన్‌తో పాటు మంచినీటి సరఫరా, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మంచినీటి సరఫరాపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, మండల ఏఓ రమేష్‌బాబు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గౌనివారిపల్లెలో చోరీ

**భారీగా బంగారు నగలు అపహరణ**

కురబలకోట, మే 2 ప్రభాతవార్త :

కురబలకోట మండలం గౌనివారిపల్లెలో భారీ చోరీ జరిగింది. ఈ సంఘటన కుటుంబసభ్యులు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈ చోరీ జరిగింది. ఇంటిలోని నగలు, నగదును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. కురబలకోట మండలం గౌనివారిపల్లెలో నివాసం ఉన్న సోమశేఖర్‌రెడ్డి ఇంటిలో శుక్రవారం మద్యాహ్నం చోరీ జరిగింది. ఈ చోరీలో 250గ్రాముల బంగారు, 10లక్షల నగదు చోరీ అయినట్లు తెలిపారు. ఇంటిలోని వారు టమోటా సాగుకు వెళ్ళినపుడు ఈ ఘటన చోటుచేసుకొంది. మద్యాహ్నం పని ముగించుకొని ఇంటికి వచ్చి చూస్తే వస్తువులన్నీ చిందర ఒందరగా పడి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫర్యాదు చేశారు. బీరువాలోని బంగారు నగలు, నగదు చోరీకి గురయ్యాయని ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



చోరీజరిగిన దృశ్యం

## హజరత్ సయ్యద్ షా ఆలంపీర్
## ఖుద్దిససిర్రహు వారి ఉరుసు

కమలాపురం మే 02 ప్రభాతవార్త

మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఆలంపీర్ ఖుద్దిససిర్రహు వారి ఉరుసు కార్యక్రమాలు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు మహోత్సవాలను కీ.శే. గండ్లూరు పెద్ద వీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి లక్ష్మయ్య శెట్టి వారి ఇంటి నుంచి గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. పకీర్ల మేళతాళాలతో, బాణా సంచా కాల్చుతూ, డప్పు వాయిద్యాల నడుమ పూల చాందిని అలంకరణలో గంధోత్సవాన్ని పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి అనంతరం దర్గాలోని స్వామి మజార్పై ఎక్కిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని గంధోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

**4న ఉరుసు:......**

ఈనెల 4వ తేదీన సయ్యద్ షా ఆలంపీర్ ఉరుసు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9గంటలకు మోపూరి చిన్న ఎల్లారెడ్డి. మోపూరి శివారెడ్డి ఇంటి నుంచి జెండా ఊరేగింపు నిర్వహిస్తామని వారు తెలిపారు. అనంతరం గొప్ప ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. బెంగుళూరుకు చెందిన జామీర్ షాహ్ జాద బెల్గామ్కు చెందిన మొహసిన్ చిష్టి ఖవ్వాల్ మధ్య ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. అలాగే దాతలు ఉక్కు ప్రవీణ్ సహకారంతో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.



## గ్రామీణ విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లీష్‌పై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, మే 2 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు జ్ఞానోదయ హైస్కూల్‌లో పినాక సొసైటి ద్వారా స్పోకన్ ఇంగ్లీష్, పర్సనాలిటి డెవలప్‌మెంట్ తరగతులను ఉచితంగా నిర్వహించనున్నట్లు పినాక సొసైటి పౌండర్ బి.యాదగిరి ఐఆర్ఎస్ తెలిపారు. శుక్రవారం జ్ఞానోదయహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జ్ఞానోదయహైస్కూల్‌లో డిగ్రీ మొదటిసంవత్సరం, ఆ పై చదువుతున్న విద్యార్థులకు కెరియర్‌గైడ్స్, స్పోకన్ ఇంగ్లీష్‌పై ఉచితంగా తరగతులు నిర్వహిస్తామన్నారు. యువతకు వ్యాపార వేత్తగా ఎదగడానికి కావాల్సిన అన్ని శిక్షణలు, మెలుకవలను అందిస్తామని తెలిపారు. 2012నుంచి రాయలసీమ పరిధిలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పినాక ట్రస్టు, మేనేజింగ్ డైరెక్టర్ గాయత్రి, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, కోర్సు డైరెక్టర్ రెడ్డప్ప, రేణుక, లలిత, రమేష్‌లు పాల్గొన్నారు.

## ఉద్యోగ నియమాకాల్లో సత్తా చాటిన శ్రీ సాయి విద్యార్థులు




రాయచోటి మే 2 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం గురువారం నాడు ప్రముఖ ఐటీ సంస్థ తపస్వి ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. ఈ ఉద్యోగ నియామకాల కార్యక్రమానికి హాజరైన సంస్థ హెచ్ ఆర్ ప్రతినిధి ట్రీ. పావని హాజరైన విద్యార్థినీ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఐటీ రంగ నియామకాల విధివిధానాలను, రాత పరీక్ష ,గ్రూప్ డిస్కషన్, వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగించారు. శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఐటీ రంగం ఉద్వాసన రంగాన్ని అధిగమించి తిరిగి నియామకాల జోరు అందుకుంటున్నదని వివరించారు. సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపిక ప్రక్రియలో ఎనిమిది మంది విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన వారికి 2.1 లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలియజేశారు. కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని పోటీ పరీక్షల ప్రతిభ కనపరచడానికి అవసరమగు అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్ ,వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు అభినందించారు.

## శాస్త్రోక్తంగా సామూహిక ఉపనయనం

పీలేరు మే 2 ప్రభాతవార్త :

బ్రాహ్మణ వటువుల సామూహిక ఉపనయన కార్యక్రమాన్ని శాస్త్రవేత్తంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పీలేరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ వటువులకు 17వ సామూహిక ఉపనయన కార్యక్రమం అంగరంగ వైభవముగా జరిగింది. గణపతి పూజ, స్వస్తి వచనం, గణపతి హోమం, నాంది, నవగ్రహ పూజ, చవలం, బ్రహ్మోపదేశం, భిక్షంబియ్యం తదుపరి నూతన వటువులచే గాయత్రీ దేవి, శంకరాచార్యుల చిత్రపటాల ఊరేగింపు కార్యక్రమం జరిపారు. కళ్ళే జయశ్రీ, నరసింహమూర్తి 9 మంది వటువుల తల్లిదండ్రులకు నూతన వస్త్ర,తాంబూలాదులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు బ్రాహ్మణ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, తెనాలి రామ సుబ్రహ్మణ్యం, గొల్లాపిన్ని ప్రభాకర్ రావు, నరసింహమూర్తి, జీవీఎస్ఆర్కే ప్రసాద్, కె వెంకటేశ్వర్లు, వేంపల్లి నరసయ్య, చంద్రా స్వామి, బాలా చార్, విరూపాక్షం కాశీనాథ్, ఉద్యా మయూర్ నాథ్, విరూపాక్షం విశ్వనాథ్, పి.మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో జరిగిన సామూహిక ఉపనయనంలో పాల్గొన్న వటువులు

## గుండ్లపల్లిలో పురివిప్పిన మయూరం.

తంబళ్లపల్లె మే 2 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి పంచాయతీలో రెండు రోజులుగా కురిసిన తేలికపాటి వర్షాలకు అటవీ ప్రాంతంలోని నెమళ్లు గ్రామాలలోకి వస్తున్నాయి. చల్లటి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడడంతో గ్రామాలలో మయూరాలు పురి విప్పి నాట్యం ఆడడం స్థానిక ప్రజలు ఆస్వాదిస్తున్నారు. ప్రజలు సైతం మయూరాలకు ఆహారం అందించి స్వాగతిస్తున్నారు.



## నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వేంపల్లి : మే 02 (ప్రభాత వార్త):

గాలి, వానకు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి, పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధ, గురు వారాలలో వీచిన పెను గాలులకు వేంపల్లి మండలం లో అరటి పంట తీవ్రంగా దెబ్బతినడంతో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి రైతులతో ,కౌలు రైతుల తో మాట్లాడారు. ఎకరాకు రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టామని,పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి,పెను గాలికి పూర్తిగా నేలమట్టం అయిందని ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మ హత్యే తమకు శరణ్యమని కౌలు రైతులు రామ గంగి రెడ్డి,గజ్జల ఈశ్వర్ రెడ్డి వాపోయారు. ప్రభుత్వం ఎకరాకు కనీసం రు 50 వేలు పెట్టుబడి సాయం అందించాలని, అలాగే అరటి పిలకలను కూడా ఉచితంగా సరఫరా చేయాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ , అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వేమా, అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



అరటిపంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు